# నిద్రిత హృదయం - ఒక లేఖ

**--- విజ్ఞానేశ్వర కుమార్**

ఒక రోజు తీవ్రమైన శాస్త్ర చర్చ మధ్యలో మా ప్రొఫెసరు గారొకాయనడిగారు, ఈ మధ్య పద్యాలేమైనా చదివారా అని! ఇదేఁవిటీ పిడకల వేటన్నట్లుగా తలెత్తి చూశాను. నవ్వారాయన. పువ్వుని పువ్వులాగా చూడటం, ఏ పువ్వో గుర్తించటం అంతే శాస్త్రజ్ఞానం. అదే పువ్వుని తుమ్మెద ప్రియురాల్లాగా, స్త్రీ కన్ను లాగా (పద్మాక్షి), సత్యభామ ముక్కు లాగా (నాన సూన వితాన ------) అలా పది రకాలుగా చూడగలగడం `రవి గాంచని ---' అందాలు ఊహించడం అందమైన పద్యంలో మనకి చూపించడం కవులే చేయగలరు అలా పద్యమే చెప్పగలదూ అన్నారు. ఎంత సేపూ y = mx + c అంటూ ఒకే పట్టా మీద సూటిగా నడవకూ, సమస్యని నాలుగు వైపుల్నించీ చూడటం విశ్లేషించడం నేర్చుకో మొద్దబ్బాయి అని మెత్తగా చురకలు వేశారనమాట. కానీ పుట్టుకతో పుట్టింది, పద్యం చూడగానే పేజీ తిరగేశే బుద్ధి, పోయింది గాదు.

సభ జేసి, పిలిచి, భోజనం పెట్టి మర్యాదగా బహుమానఁవిచ్చారు గదా అని చదవడం మొదలు పెట్టాను వైదేహి గారి పద్యమాల 'నిద్రిత నగరం'. చదువుతూంటే మా ప్రొఫెసరు గారి మాటలే గుర్తొచ్చాయి, `కవిరుదయం అతి గహనం` అన్న ముళ్ళపూడి వారి నిర్వచనం గుర్తొచ్చింది. అదే విశాఖ లో అన్ని సంవత్సరాలున్నానూ అదే అఖాతంలో (Bay of bengal) అన్ని మునకలు వేశానూ అలల తాకిడే తప్ప వాటి అందం తెలియలేదు గదా అనిపించింది.

ఎందుకంటే నీది `నిద్రిత హృదయం` కాబట్టీ అని వినిపించింది అశరీరవాణి అట్లకాడ తిరగేస్తూ.